సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 13 | ఆగస్టు | 2025

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సహాయక చర్యలు చేపట్టాలి
- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- టెలికాన్ఫరెన్స్‌లో నగర మేయర్ గుండు సుధారాణి

హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలి
- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

- వివరాలు 8లో ▸



గరిష్టం/కనిష్టం
28^0 / 24^0

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.


హంటర్‌రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్స్ ఎదుట ప్రవహిస్తున్న వర్షపు నీరు


హనుమకొండ గోకుల్‌నగర్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు


ఉర్సుగుట్ట డీకేనగర్‌లో వృద్ధురాలిని బయటకు తీసుకొస్తున్న కార్పొరేటర్ రవి, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది


కాశికుంటలో ఇంటిలోకి నీళ్లు రావడంతో ఆదుకోవాలని వేడుకుంటున్న వృద్ధురాలు


వరంగల్ శివనగర్‌లో నీటిలో చిక్కుకున్న బాలుడిని తాళ్ల సాయంతో బయటకు తీసుకొస్తున్న స్థానికులు


కాశికుంటలో ఇంట్లోకి నీరు రావడంతో సామగ్రిని బల్లపై పెట్టి కూర్చున్న మహిళ


నాగేంద్రనగర్‌లో నీటమునిగిన ఇంటిని చూపిస్తున్న యువతి


గిరిప్రసాద్‌నగర్‌లో చిన్నారులను తీసుకొస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్సై సురేశ్


వాంబేకాలనీలో చనిపోయిన దివ్యాంగురాలు

హంటర్ రోడ్డులో నీట మునిగిన సంతోషిమాత కాలనీ ప్రాంతం



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీరు



అధికారులు అందుబాటులో ఉండాలి
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ జిల్లా పరిధిలోని అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో సంబంధిత శాఖలను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు స్థానికంగా తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి : సీపీ సన్‌ప్రీత్ సింగ్
వరంగల్ క్రైం: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, శిథిలావస్థ భవనాల్లోని నివాసితులు ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షంలో వాహనాలపై వెళ్లే వారు వాహనాల కండీషన్ పరిశీలించుకోవాలని, ఏమైనా విపత్కర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అర్ధరాత్రి.. ఆగమాగం

వరంగల్ నగరంలో కుంభవృష్టి
- జలదిగ్బంధంలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు
- పలుకాలనీల ఇళ్లలోకి చేరిన వరదనీరు
- అండర్ బ్రిడ్జి నుంచి నిలిచిన రాకపోకలు
- బాధితులకు ఆహారం అందించిన దాతలు

ఖిలా వరంగల్:

భారీ వర్షానికి వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు కురిసిన కుంభవృష్టితో జనజీవనం స్తంభించిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరంగల్ అండర్ బ్రిడ్జి కింది నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. విలీన గ్రామాల్లో చెరువుల మత్తడితోనే ఈ దుస్థితి వచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా దూపకుంట, గాడిపల్లి, గుంటూరుపల్లి నుంచి పెద్ద ఎత్తున వరదనీరు తూర్పుకోటకు చేరుతోంది. దీంతో అగర్త చెరువులు నిండి వరదనీరు మైసయ్యనగర్, శివనగర్, పెరికవాడ అంతర్గత కాలనీల్లో ప్రవహిస్తోంది. మట్టికోట అగర్త చెరువు మత్తడి నీరు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పక్క నుంచి జాతీయ రహదారి మీదుగా నాగేంద్రనగర్, కాశికుంట, విద్యానగర్, లక్ష్మీనగర్, సాకరాశికుంట, శాంతినగర్, ఎస్ఆర్ఆర్‌తోట మీదుగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశాయి.

నీటిలో కాకతీయుల రాజధాని..
- చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోట నీటిలో మునిగింది. మధ్యకోటలో పంటపొలాలు, ఆకుకూర తోటలు నీటిలో మునిగిపోయాయి. సుమారు రూ.5 లక్షల మేరకు పంట నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొన్నారు.

వాంబేకాలనీలో వృద్ధురాలి మృతి
- వరంగల్ 41వ డివిజన్ కాశికుంట వాంబే కాలనీకి చెందిన వృద్ధురాలు పసునూటి బుచ్చమ్మ మృతి చెందింది. మానసిక దివ్యాంగురాలైన ఆమె పడుకున్న మంచం నీటిలో మునిగింది. కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ వృద్ధురాలు అప్పటికే మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసుల సహాయక చర్యలు..
- మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన కాలనీల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు, గిరిప్రసాద్‌నగర్‌లో నీట మునిగిన ఓ ఇంటిలోని కుటుంబాన్ని క్షేమంగా ఇన్‌స్పెక్టర్ కాపాడి బయటకు తీసుకొచ్చారు.

నీటమునిగిన కాలనీలు..
- హన్మకొండ: హనుమకొండలోని గోకుల్‌నగర్, అశోకాకాలనీ, రాంనగర్‌తోపాటు పలు కాలనీలు వరద నీటిలో మునిగాయి. వరద నీరు పారడంతో రోడ్లు వాగులను తలపించాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు అతి భారీ వర్షం కురిసింది.
- హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి ఆలయ రోడ్డులోని సరస్వతి టెంపుల్ స్ట్రీట్‌లో భారీగా వరదనీరు చేరింది. దీంతో కాలనీవాసులు ఇళ్లు ఖాళీ చేసి వారి బంధువులు, స్నేహితుల ఇళ్లలోకి చేరారు. పెద్దమోరీలో చెత్త తొలగించకపోవడంతో కాలనీ ముంపునకు గురవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

రామన్నపేట: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద ప్రజలకు సూచించారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయమైన వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని సాయిగణేశ్ కాలనీ, గాంధీనగర్, డీకే నగర్, లెనిన్‌నగర్, అగర్తల చెరువు, మైసయ్యనగర్, గిరిప్రసాద్‌కాలనీ, పద్మనగర్, సాకరాశికుంటలో వర్షపు నీరు బయటకు వెళ్లే స్ట్రాం వాటర్ డ్రెయిన్లు ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని, ఆహారం, మందులు అందుబాటులో ఉంచామని, ప్రస్తుతం పిల్లలను పాఠశాలకు పంపించొద్దని, పిల్లలు చేపల వేటకు వెళ్లకుండా తల్లిదండ్రులు నియంత్రించాలని, మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని సమాచారం అందిందని వెల్లడించారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ బాధితులకు నగరంలో 6 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, కార్పొరేటర్ భోగి సువర్ణ సురేశ్, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, డీఎఫ్ఓ శ్రీధర్‌రెడ్డి, ఎంహెచ్ఓ రాజేశ్ ఉన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్యశారద

నేడు, రేపు స్కూళ్లకు సెలవులు
విద్యారణ్యపురి: భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ సూచన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ పరిధి హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో బుధ, గురువారాలు (రెండు రోజులు) పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, డీఈఓలకు ఉత్తర్వులు అందాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విధిగా సెలవులు పాటించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


వాంబే కాలనీలో నీటిలో నుంచి పిల్లలను తీసుకొస్తున్న మహిళ

కంట్రోల్ రూంల ఏర్పాటు

టోల్ ఫ్రీ నంబర్ :	1800 4251980
వరంగల్ కలెక్టరేట్ :	97019 99676
హనుమకొండ కలెక్టరేట్ :	79819 75495

అత్యవసరమైతే సాయం కోసం ఈ నంబర్లలో సంప్రదించాలి

హనుమకొండ జిల్లాలో 34.1 మిల్లీమీటర్లు..
హనుమకొండ: జిల్లాలో మోస్తరు నుంచి అతి భారీ వర్షం కురిసింది. జిల్లాలో సగటున 34.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హనుమకొండలో 11.37 సెంటీమీటర్లు, ఐనవోలులో 85.4 మిల్లీమీటర్లు, కాజీపేటలో 81.6 మిల్లీమీటర్లు, భీమదేవరపల్లిలో 12.1 మిల్లీమీటర్లు, వేలేరులో 21.6, ఎల్కతుర్తిలో 15.1, కమలాపూర్‌లో 13.6, హసన్‌పర్తిలో 31.5, ధర్మసాగర్‌లో 29, కాజీపేటలో 81.6, హనుమకొండలో 113.7, ఐనవోలులో 85.4, పరకాలలో 6.6, దామెరలో 36.4, ఆత్మకూరులో 8, శాయంపేటలో 11.7, నడికూడలో 10.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వరంగల్ జిల్లాలో 97.2 మిల్లీమీటర్లు
వరంగల్ జిల్లాలో సగటున 97.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సంగెంలో 202.7 మిల్లీమీటర్లు, ఖిలా వరంగల్‌లో 148.5, వర్ధన్నపేటలో 122.3, పర్వతగిరిలో 107.5, వరంగల్‌లో 94.9, గీసుకొండలో 91.3, నెక్కొండలో 88.2, చెన్నారావుపేటలో 86, రాయపర్తిలో 82.8, ఖానాపురంలో 70.3, దుగ్గొండిలో 63, నల్లబెల్లిలో 55.2, నర్సంపేటలో 51.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

యథావిధిగా శాతవాహన
కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–విజయవాడ–సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే శాతవాహన ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 7 నుంచి యథావిధిగా నడవనున్నట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ వెళ్లకుండా వయా బైపాస్ చర్లపల్లి, మల్కాజ్‌గిరి మీదుగా కాచిగూడ వరకు వెళ్తున్న విషయం తెలిసిందే. కాగా, వచ్చే నెల 7 నుంచి మౌలాలి, కాజీపేట, వరంగల్ మీదుగా యథావిధిగా విజయవాడకు నడవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

హడప్సర్–కాజీపేట ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పులు..
వచ్చే నెల 8వ తేదీ నుంచి హడప్సర్–కాజీపేట జంక్షన్ మధ్య నడిచే హడప్సర్ ఎక్స్‌ప్రెస్ వేళలు మారనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రతీ సోమ, మంగళ, శనివారాల్లో కాజీపేట నుంచి హడప్సర్ బయలుదేరే హడప్సర్ ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17014) సెప్టెంబర్ 8వ తేదీన 18:15 గంటలకు బయలుదేరుతుంది. ప్రతీ ఆది, బుధ, శుక్రవారాల్లో హడప్సర్ నుంచి కాజీపేటకు వచ్చే ట్రై వీక్లీ హడప్సర్ ఎక్స్‌ప్రెస్ (17013) కాజీపేటకు రాత్రి 08:15 గంటలకు బదులు 06:45 గంటలకు చేరుతుందని తెలిపారు.

నేటినుంచి కాకతీయ ఆలయాలపై వర్క్‌షాపు
విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13,14 తేదీల్లో రెండురోజులపాటు కాకతీయ టెంపుల్స్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ అనే అంశంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి, కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. వర్క్‌షాప్‌నకు భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరుకావాలని మంగళవారం వారు ఒక ప్రకటనలో సూచించారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది మేలో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫలితాలు, దూరవిద్య కేంద్రం డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం మంగళవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 31 శాతం, రెండో సెమిస్టర్‌లో 30 శాతం, మూడో సెమిస్టర్‌లో 35 శాతం, నాలుగో సెమిస్టర్‌లో 39 శాతం, దూరవిద్య మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 24 శాతం ఉత్తీర్ణత సాధించారని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం.తిరుమలాదేవి, జి.పద్మ, ఆసిం ఇక్బాల్, చిర్ర రాజు, వి.మహేందర్, పి.వెంకటయ్య అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నేతాజీ, క్యాంపు ఆఫీసర్ ఎస్.సమ్మయ్య పాల్గొన్నారు.


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పరీక్షల విభాగం అధికారులు

మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభం
వరంగల్ క్రైం: ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అందించిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర ప్రదేశంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించేందుకు మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తపు మరకలు, వేలిముద్రలను వాహనంలో ఆధునిక పరికరాలతో పరిశోధించి దర్యాప్తు అధికారికి ప్రాథమిక ఆధారాలను అందించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, రీజినల్ ఎఫ్ఎస్ఎల్ జాయింట్ డైరెక్టర్ నీరజ, ఫింగర్‌ప్రింట్ విభాగం ఇన్‌స్పెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీధర్, ఆర్ఐలు శ్రీధర్, స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఫింగర్‌ప్రింట్ ఎస్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మొబైల్ ఫోరెనిక్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

నేచురోపతి సెంటర్‌తో కేయూ ఎంఓయూ
కేయూ క్యాంపస్: హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలోని ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం ఇంటర్నేషనల్ నేచురోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌తో కాకతీయ యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకుంది. ఈమేరకు మంగళవారం సాయంత్రం యూనివర్సిటీలో నిర్వహించిన కేయూ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించి ఆమోదించారు. ఈఎంఓయూతో సైన్స్ లైఫ్‌సైన్సెస్, ఫార్మసీ, లైబ్రరీ సైన్స్ తదితర విభాగాల పీజీ విద్యార్థులు, పరిశోధకులు లైబ్రరీ రీసెర్చ్ సెంటర్‌ను వినియోగించుకోవచ్చు. త్వరలో నిర్వహించనున్న కేయూ పాలకమండలిలో దీనిని ఆమోదించనున్నారు. ఇదిలా ఉండగా మూడేళ్ల బీసీఏ, రెండేళ్ల ఎంసీఏ కోర్సు సిలబస్, డిగ్రీ కోర్సులకు సంబంధించి ఫస్టియర్ మొదటి సెమిస్టర్, సెకండ్ సెమిస్టర్ కామన్ కోర్ సిలబస్‌ను కూడా స్టాండింగ్ కమిటీ అప్రూవల్ చేసింది. పీహెచ్‌డీ స్కాలర్లలో రెగ్యులర్ స్కాలర్లు, స్కాలర్‌షిప్‌లు లేని వారికి ట్యూషన్ ఫీజు రూ.1000 తగ్గించాలని నిర్ణయించారు. వీసీ కె.ప్రతాప్‌రెడ్డి,రిజిస్ట్రార్ వి.రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లతో చర్చలు సఫలం
హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ సెంటర్ కాంట్రాక్టర్లతో యాజమాన్యం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ముడిసరుకుల రేట్లు పెరగడంతో నష్టాల పాలవుతున్నామని, ధరలు పెంచాలని కోరుతూ ఈ నెల 10 నుంచి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాల కాంట్రాక్టర్లు సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో మరమ్మతులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మంగళవారం కాంట్రాక్టర్లతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఈ చర్చల్లో ధరలు పెంచేందుకు యాజమాన్యం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించామని కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు అర్జుల నర్సింహారెడ్డి తెలిపారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి
- జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణ
- వరంగల్ డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ధర్నా

విద్యారణ్యపురి: వరంగల్ విద్యాశాఖలోని సమగ్ర శిక్షలోని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజపై డీఈఓ జ్ఞానేశ్వర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మంగళవారం రాత్రి టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ, పీఆర్‌టీయూ తెలంగాణ, డీటీఎఫ్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్, టీయూటీఎఫ్, టీజీటీయూ, హెడ్మాస్టర్స్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ల బాధ్యులు వరంగల్ డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మంగళవారం వివిధ అకడమిక్ అంశాలపై ఎంఈఓలతో వాట్సాప్ గ్రూప్‌కాల్ జూమ్ మీటింగ్‌లో సుజన్‌తేజ మాట్లాడుతుండగా డీఈఓ జ్ఞానేశ్వర్ దుర్భాషలాడి అవమానపర్చారని ఆరోపించారు. డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సత్యశారద వద్దకు వెళ్లి కలిసి డీఈఓ వైఖరిపై, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్‌పై దుర్భాషలాడారని పలు ఆరోపణలు చేస్తూ చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

ఏసీపీకి ఫిర్యాదు..
వరంగల్ డీఈఓ మామిడాల జ్ఞానేశ్వర్ తనపై దుర్భాషలాడారని ఆరోపిస్తూ జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజ మంగవారం రాత్రి హనుమకొండ ఏసీపీ నర్సింహారావుకు ఫిర్యాదు చేశారు.


కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు

ఒక్కరోజు ఆదాయంలో వరంగల్-1 డిపో అగ్రస్థానం
హన్మకొండ: రాఖీ పండుగ ఒక్క రోజు ఆదాయంలో రాష్ట్రంలోనే ఆర్టీసీ వరంగల్-1 డిపో అగ్రస్థానంలో నిలిచింది. వరంగల్-1 డిపో ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ఇప్పటి వరకు ఉన్న లక్ష్యాలను అధిగమించి కొత్త చరిత్ర సృష్టించారు. సోమవారం ఒక్క రోజు చార్జీలు చెల్లించిన ఆదాయంలో వరంగల్-1 డిపో టాప్ వన్‌లో నిలిచింది. రాష్ట్రంలోని ఆర్టీసీ 97 డిపోల్లో వరంగల్-1 డిపో టికెట్ చార్జీల ద్వారా రూ.49.14 లక్షల ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ నెల 11న 79,057 కిలోమీటర్లు బస్సులు తిరిగి మహాలక్ష్మి ఉచిత ప్రయాణికులతో పాటు టికెట్ చార్జీల ద్వారా మొత్తం 55,767 మంది ప్రయాణికులను చేరవేసి 102 ఆక్యుపెన్సీ రేషియో ద్వారా రూ.62 లక్షల ఆదాయాన్ని సాధించింది. ఇందులో టికెట్ ద్వారా రూ.49.14 లక్షలు, మహాలక్ష్మి ఉచిత ప్రయాణం ద్వారా రూ.12.87 లక్షల ఆదాయం వచ్చింది. లక్ష్యాన్ని ఛేదించేందుకు దృఢసంకల్పంతో విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యం అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా వరంగల్-1 డిపో మేనేజర్ పుష్పాల అర్పిత మాట్లాడుతూ డిపో అధికారులు, ఉద్యోగులు అహర్నిశలు శ్రమించి రాఖీ పండుగకు వచ్చి వెళ్లే ప్రయాణికులను క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేశారని తెలిపారు.

సగానికిపైగా డిగ్రీ సీట్లు ఖాళీ

కేయూ పరిధిలో మొత్తం 97,930 సీట్లకు భర్తీ అయ్యింది 40 వేలే..

- మూడు దశలు, స్పెషల్ ఫేజ్ ప్రవేశాలు కూడా పూర్తి
- నేడు, రేపు ప్రైవేట్ కళాశాలలకు స్పాట్ అడ్మిషన్లు
- ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర కోర్సుల వైపే విద్యార్థుల మొగ్గు
- సాంకేతిక కోర్సులు అందించినా ఆదరణ కరువు



కేయూ పరిధిలో మొత్తం
డిగ్రీ కళాశాలలు : 211
మొత్తం సీట్లు : 97,930
భర్తీ అయిన సీట్లు : 40,585

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సగానికిపైగా సీట్లు ఖాళీగానే ఉన్నాయి. కొన్ని కళాశాలల్లో సీట్లు ఎక్కువ శాతం భర్తీకాగా మరికొన్ని కళాశాలల్లో తక్కువ భర్తీ అయ్యాయి. పలుకోర్సులకు డిమాండ్ ఉండగా కొన్నింటికీ అంతగా ఆదరణ లభించడడం లేదు. మూడు దశల్లోనూ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా ఈ విద్యాసంవత్సరం ప్రవేశాలు కల్పించారు. ఇప్పటికే మూడు దశల్లో ప్రవేశాలు కల్పించగా స్పెషల్ ఫేజ్‌లో సీట్లు కేటాయించిన వారికి రిపోర్టింగ్ కూడా మంగళవారం ముగిసింది. యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కాలేజీలు 211 ఉన్నాయి. అందులో బీఏ, బీఎస్సీ, బీకామ్ జనరల్, బీకామ్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ కంప్యూటర్స్, బీబీఏ రిటైల్ పలు కోర్సులు కంప్యూటర్ బేస్డ్ తో కూడా ఉన్నాయి. లైఫ్ సైన్సెస్ కోర్సులు కూడా ఉన్నాయి. ఇందులో 97వేల 930సీట్లు ఉన్నాయి. మూడుదశల్లోనూ, స్పెషల్ ఫేజ్‌లో కలిపి ఇందులో సోమవారం వరకు 40,585 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అక్కడక్కడ కాలేజీల్లో వేళ్లమీద లెక్కపెట్టేంత మంది అడ్మిషన్లు మినహా ఇంకా సగానికి పైగా సీట్లు ఖాళీగానే ఉండబోతున్నాయి.

ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు మొగ్గు..

విద్యార్థులు సంప్రదాయ డిగ్రీ కోర్సుల వైపు కంటే వృత్తివిద్య, ఉపాధి కోర్సులవైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడిసిన్, పారా మెడికల్ తదితర కోర్సుల్లో చేరేందుకే ఆసక్తి చూపుతున్నారు. డిగ్రీ కోర్సుల్లో కంప్యూటర్ కాంబినేషన్ కోర్సులు డాటా సైన్స్ లైఫ్ సైన్సెస్‌తో కూడిన తదితర కోర్సులున్నప్పటికీ అంతగా ఆసక్తి చూపడం లేదు. డిగ్రీ విద్యార్థుల కోసం కొన్ని సంవత్సరాలుగా కేయూ పరిధిలో 30 వరకు గురుకుల డిగ్రీ కళాశాలలు కూడా ఏర్పాటై కొనసాగుతున్నాయి. కొందరు విద్యార్థులు గురుకుల డిగ్రీకళాశాలల్లోను నేరుగా ప్రవేశాలు పొందుతున్నారు. దీంతో కూడా ప్రభుత్వ కళాశాలల అడ్మిషన్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో మొత్తం 1,770 సీట్లకు 1,110 మాత్రమే భర్తీ అయ్యాయి. పింగిళి మహిళా కళాశాలలో 1,200 సీట్లకు 706 సీట్లు మాత్రమే భర్తీ కావడం గమనార్హం. అలాగే ఇతర డివిజన్ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లోని కాలేజీల్లో సగానికి పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయి.

స్పాట్ అడ్మిషన్లు ప్రైవేట్ కాలేజీలకే..

డిగ్రీలో దోస్త్ ద్వారా సీట్లు కేటాయించిన కళాశాలల్లో ప్రవేశాలకు మంగళవారం గడువు ముగిసింది. ఆ తరువాత ఈనెల 13,14 తేదీల్లో రెండు రోజుల పాటు ఇప్పటివరకు ఏఏ కళాశాలల్లో ప్రవేశాలు పొందలేని విద్యార్థులకు ఉన్నత విద్యామండలి స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించింది. ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు నేరుగా తమ కళాశాలల్లో వేకెన్సీ సీట్లను భర్తీ చేసుకునే వీలు కల్పించింది. అయితే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మాత్రం స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఇవ్వలేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్లను భర్తీచేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, ఇతర బాధ్యులు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.అవకాశం ఇస్తారా లేదా అని చూడాల్సిందే.

కేటాయింపులు, భర్తీ సీట్ల వివరాలు..

కేయూ పరిధిలో మొదటిదశలో డిగ్రీ కళాశాలలకు 10,652 సీట్లు కేటాయించగా 5,289 మంది రిపోర్టు చేశారు. రెండో దశలో 9,732 సీట్లు కేటాయించగా అందులో 6,550 సీట్లు భర్తీ అయ్యాయి. మూడోదశలో 21,373 సీట్లు కేటాయించగా అందులో 17,019 సీట్లు భర్తీ అయ్యాయి. స్పెషల్ ఫేజ్‌లో 12,916 సీట్లు కేటాయించగా అందులో 11,727 మొత్తంగా 40,585 సీట్లు భర్తీ అయ్యాయి.

తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్‌కు ఏర్పాట్లు చేయాలి

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



కమిటీ బాధ్యులతో సమీక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 19, 20, 21 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు ఏర్పాట్లు చేయాలని కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం అకడమిక్ కమిటీ హాల్‌లో సంబంధిత కమిటీల బాధ్యులతో నిర్వహించిన సమీక్షలో వీసీ మాట్లాడారు. సైన్స్‌కాంగ్రెస్‌కు హాజరు కాబోయే అతిథులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు ఉండాలన్నారు. వర్షాల నేపథ్యంలో కూడా అందుకనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. క్యాంపస్‌లోని పలు సెమినార్‌హాళ్లలో పేపర్ ప్రజెంటేషన్‌లు ఉన్న నేపథ్యంలో అక్కడ ఆధునిక సాంకేతిక పరికరాలను కూడా ఏర్పాటుచేయాలన్నారు.ఈ సమీక్షలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. వెంకట్రామ్ రెడ్డి, ప్రొఫెసర్లు మల్లారెడ్డి, ఎస్. ప్రసాద్, స్వర్ణలత, డి. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



డి.విజయ భాను, ఆర్టీసీ ఆర్‌ఎం, వరంగల్

హన్మకొండ: శ్రావణమాసం సందర్భంగా శైవ క్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పంచారామాల దర్శన యాత్రకు సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు. ఈ నెల 17న హనుమకొండ బస్ స్టేషన్ నుంచి ప్రత్యేక పంచారామ దర్శన యాత్రకు సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాత్రలో భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధి చెందిన పంచారామ క్షేత్రాలు అమరావతి అమరలింగేశ్వర స్వామి, భీమవరం శ్రీసోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీర లింగేశ్వర స్వామి, ద్రాక్షారామం భీమేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వర స్వామి దర్శించుకోవచ్చన్నారు. ఒకే రోజు ఐదు శైవ క్షేత్రాలను దర్శించుకోవడం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక అనుభవాలు పొందొచ్చన్నారు. ఈ యాత్ర బస్సులు ఆగస్టు 17న (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్ నుంచి ప్రారంభమై సోమవారం అన్ని క్షేత్రాల దర్శనం అనంతరం తిరిగి మంగళవారం ఉదయం హనుమకొండకు చేరుకుంటాయన్నారు. సూపర్ లగ్జరీ సర్వీస్ చార్జీలు పెద్దలకు రూ.2,300, పిల్లలకు రూ.1,400 నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం, టికెట్ బుకింగ్ కోసం 9063407493, 7780565971, 9866373825, 9959226047 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

29న కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత పొంది ఆరో సెమిస్టర్ పరీక్షలో ఒక సబ్జెక్టు ఫెయిల్ యిన విద్యార్థులకు ఈనెల 29న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నామని పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. సంబంధిత కళాశాలల నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కేయూ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసి.ఇన్‌ను చూడాలని రాజేందర్ పేర్కొన్నారు.

కేజీబీవీలో డీఆర్‌ఓ విచారణ



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ సుహాసిని

సాక్షి స్పందన

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. 'టీచర్లు కొడుతున్న విషయం చెప్పొద్దు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా రెవెన్యూ అధికారి సుహాసిని, జీసీడీఓ గౌసియాబేగం స్పందించి మంగళవారం విచారణ చేపట్టారు. ఉదయం 11 గంటలకు కేజీబీవీకి వచ్చిన అధికారులు పాఠశాలలోని ప్రతీ విద్యార్థితో సాయంత్రం 5 గంటల వరకు మాట్లాడారు. అలాగే, ఉపాధ్యాయులతో కూడా మాట్లాడారు. సీఈసీ సెకండియర్‌లో ఆరుగురు బాలికలకు టీసీలు ఎవరు ఇస్తామన్నారని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అలాగే, క్రమశిక్షణతోపాటు నాణ్యమైన బోధన చేపట్టాలన్నారు. విచారణ నివేదికను కలెక్టర్ తోపాటు ఉన్నతాధికారులకు అందిస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషలాఫీసర్ గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



కన్నాయిగూడెం: కూలి హత్య కేసులో నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనువాస్, ఎస్సై వెంకటేష్ వెల్లడించారు. సీఐ శ్రీనువాస్ కథనం ప్రకారం.. మూడు రోజుల క్రితం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం సర్వాయి గ్రామానికి చెందిన మడి రాజబాబు భవన నిర్మాణ పనికి వెళ్లి మేస్త్రీ కుమ్మరి బాబును కూలీ అడిగాడు. ఈ విషయంలో మేస్త్రీ బావమరిది కోరం రంజిత్.. రాజబాబును హత్య చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకుని విచారించిన అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచన

న్యూశాయంపేట: రాష్ట్ర వ్యాప్తంగా మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి జిల్లాల కలెక్టర్లు ఉన్నతాధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ వీసీలో వరంగల్ జిల్లా నుంచి కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్ నుంచి ఆమె జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, తహసీల్దార్లతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించాలని ఆదేశించారు. తమ మండలాల పరిధిలో జలమయమయ్యే ప్రాంతాలను గుర్తించి ఎటువంటి ఆటంకాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని చెప్పారు. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్..


- వ్యాపారి మృతి.. మరొకరికి గాయాలు
- కేయూ క్రాస్ సమీపంలో ఘటన

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పి ఆగి లారీని ఢీకొన్న ప్రమాదంలో ఓ కిరాణ వ్యాపారి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం కాకతీయ యూనివర్సిటీ క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కేశవాపూర్‌కు చెందిన బొడిగే సదానందం (53) కిరాణంతో పాటు కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం కూరగాయలు కొనుగోలుకు బైక్‌పై అదే గ్రామానికి చెందిన ఎర్ర సురేందర్‌తో కలిసి నగరానికి బయలుదేరాడు. ఈ క్రమంలో కేయూ క్రాస్ సమీపంలో చేరగానే బైక్ అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో సదానందం అక్కడికక్కడే మృతి చెందగా, సురేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కేయూ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.



సదానందం (ఫైల్)

పాలధారలా భీమునిపాద జలపాతం



జాలువారుతున్న జలపాతం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలోని భీమునిపాద జలపాతం పాలధారలా జాలువారింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి జలపాతం పాలనురగలా జాలువారుతూ కనువిందు చేసింది.

రజితకు కన్నీటి వీడ్కోలు..

- నివాళులర్పించిన రచయితలు, వివిధ సంఘాల ప్రతినిధులు
- మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, రిజిస్ట్రార్ రామచంద్రం
- కేఎంసీకి రజిత భౌతికకాయం దానం





అనిసెట్టిరజిత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



కేఎంసీకి రజిత భౌతికకాయాన్ని దానం చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

కేయూ క్యాంపస్ : ప్రముఖ కవి, రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రీల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిసెట్టి రజితకు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. హనుమకొండలోని గోపాల్ పూర్ ప్రాంతంలోనివాసం ఉండే అనిసెట్టి రజిత (67) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూసిన విషయం విధితమే. రజిత కేయూలో నాన్‌టీచింగ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి కొన్ని సంవత్సరాల క్రితమే ఉద్యోగవిరమణ పొందారు. ఆమె అవివాహిత. కొంతకాలంగా అద్దె ఇంట్లో ఉంటున్నారు. గుండెపోటు వచ్చి అపస్మారకస్థితికి చేరడంతో రచయిత శోభారమేశ్ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి యజమాని నిరాకరించడంతో కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ఆచార్యులు కాత్యాయనివిద్మహే ఇంటి వద్దకు రజిత భౌతికకాయాన్ని తరలించారు. ఇక్కడ రచయితలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు.. రజితకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజిత ప్రజాస్వామిక రచయిత్రీల జాతీయ వేదిక అధ్యక్షురాలిగా అందించిన సేవలు, ఆమెతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర..

ప్రముఖ రచయిత్రీ అనిసెట్టి రజిత మృతి బాధాకరమని, తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో ఆమె క్రియాశీలక పాత్ర వహించారని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రజిత భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కేఎంసీకి రజిత భౌతికకాయం దానం

సంతాపసభ అనంతరం రచయితలు, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు అంబులెన్స్‌లో రజిత భౌతికకాయంతో కేయూ మొదటి గేట్ క్రాస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రజితకు జోహార్లు అర్పించారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని వరంగల్ కేఎంసీకి తరలించి దానం చేశారు. అంతకు ముందు నేత్ర వైద్యులు రజిత నేత్రాలు సేకరించారు.

విలువలతోకూడిన జీవితానికి ఆమె నిదర్శనమన్నారు. స్త్రీ సామాజిక సమానత్వం కోసం తన రచనల ద్వారా చైతన్యం నింపారన్నారు.అనిసెట్టి రజిత తన రచనల ద్వారా ప్రజలను చైతన్యపర్చారని కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. అనిసెట్టి రజిత మృతి ప్రజాస్వామిక రచయిత్రీల వేదికకు తీరని లోటని ఆ వేదిక జాతీయ కార్యదర్శి ఎల్లూరి మానస అన్నారు. రచయిత్రీగా రజిత తన అభిప్రాయాలు నిర్మొహమాటంగా వెల్లడించేవారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డల లక్ష్మణ్ అన్నారు.

ఘన నివాళి..

అనిసెట్టి రజిత భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్, రచయితలు బన్న అయిలయ్య, వీఆర్ విద్యార్థి, టి చందు, తాయమ్మ రణ, శోభారమేశ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, ప్రజాఫ్రంట్ నేత బి.రమాదేవి, మహిళా సంఘం నేత సదాలక్ష్మి, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, రిటైర్డ్ ప్రొఫెసర్లు జ్యోతిరాణి, వి.శోభ,గిరిజారాణి, విజయలక్ష్మి, కిష్టయ్య, విరసం నేత కుమారస్వామి, ప్రముఖ అనువాద రచయిత నలిమెల భాస్కర్, బంధుమిత్రుల కమిటీ బాధ్యురాలు భారతక్క, తదితరులు ఉన్నారు.

వివిధ సంఘాల బాధ్యుల సంతాపం

ప్రముఖ రచయిత్రి అనిసెట్టి రజిత మృతి చాలా బాధకరమని, సమాజంలో మహిళల పరిస్థితిపై మహిళల హక్కులపై తన రచనలతో చైతన్యం కలిగించారని మానవ హక్కుల వేదిక బాధ్యుడు జీవన్‌కుమార్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా సహృదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరబాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్‌వీఎన్‌చారి, సాహిత్య కార్యదర్శి మల్యాల మనోహర్‌రావు, వనం లక్ష్మీకాంతారావు, లక్ష్మణరావు, కాళోజి ఫౌండేషన్ బాధ్యుడు డాక్టర్ ఆగపాటిరాజ్‌కుమార్ సంతాపం తెలిపారు.

విద్యుత్ అధికారులు హెడ్ క్వార్టర్‌లో ఉండాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్ల ఎస్‌ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 16 వరకు వరుసగా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందని, ఈ నేపథ్యంలో సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, ఇతర అధికారులు హెడ్‌క్వార్టర్‌లో ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేయాలన్నారు. ఎక్కడైనా అంతరాయాలు సంభవిస్తే వెంటనే సరఫరా పునరుద్ధరించేలా ఉద్యోగులు, మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకుని వెంటనే పనులు చేపట్టాలన్నారు. అత్యవసర పరిస్థితులు నెలకొనే అవకాశమున్న నేపథ్యంలో సిబ్బంది, ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు షిఫ్ట్ విధానంలో 24 గంటలు విధులు కేటాయించాలన్నారు. విద్యుత్ సమస్యలుంటే వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని కోరారు.

సహాయక చర్యలు చేపట్టాలి

- మరో 72గంటల పాటు భారీ వర్షాలు..
- వరద బాధితులకు పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు
- గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి



పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

రామన్నపేట: రానున్న 72 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి సూచించారు. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి కార్పొరేషన్, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక, వైద్యారోగ్యశాఖ, ఇరిగేషన్, ప్రెస్ దిలార్డ్ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు మేయర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు గత రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయమైన కాలనీల్లోని ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు పోలీసుల సహకారంతో తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీరు, పారిశుద్ధ్యం, దుప్పట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్పొరేషన్ డీఆర్‌ఎఫ్ మూడు బోర్డ్స్ రూఫ్స్ తదితర సామగ్రితో సిద్ధంగా ఉన్నాయని, వీరితో పాటు అపదమిత్ర, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం వంద మందితో సిద్ధంగా ఉన్నారని వారి సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు. ప్రధాన కార్యాలయంలో 24 గంటల పాటు ఏర్పాటు చేసిన మాన్సూన్ రెస్పాన్స్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 1980 మొబైల్ నెంబర్ 97099 99676 అత్యవసర సహాయార్థం సంప్రదించాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ తదితర విభాగ అధికారులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయాల సందర్శన..

టెలికాన్ఫరెన్స్ సమీక్షా ఆనంతరం మేయర్ సుధారాణి మంగళవారం రాత్రి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పోతన నగర్, మర్వాడీ భవన్‌లో, కరీమాబాద్ బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి వరద బాధితులు, నిర్వాసితులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితులకు భరోసా కల్పించి వర్షం తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని, ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మేయర్ వారికి హామీ ఇచ్చారు.

పింఛన్లు పెంచకుంటే గద్దె దించుతాం

- సీఎం రేవంత్‌కు మందకృష్ణ హెచ్చరిక
- పాలకుర్తిలో నియోజకవర్గ సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

పాలకుర్తి టౌన్: పింఛన్లు పెంచకుంటే సీఎం రేవంత్‌రెడ్డిని గద్దె దించుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళల పింఛన్ల పెంపు కోసం సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించే మహా గర్జనను విజయవతం చేయాలని కోరుతూ మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఎంతో శ్రమించిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మౌనం వీడాలని, గడీ నుంచి బయటకు రావాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 50 లక్షల మంది దివ్యాంగులను మోసం చేస్తోందని, దీనిపై కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా పోరాడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ. 6 వేలు, వృద్ధులకు రూ.4 వేలు, తీవ్ర వైకల్యం ఉన్న వారికి రూ.15 వేలు పెంచి పింఛన్లు ఇస్తామని పేర్కొందని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పింఛన్లు పెంచకుండా రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. పింఛన్ పెంపు ఎప్పుడు అమల్లోకి వస్తుందని, కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారని 50 లక్షల మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు సునీల్ మాదిగ, యాదగిరి స్వామి, తాళ్లపెల్లి కుమార్, గద్దల కిశోర్, దిండిగల వెంకన్న, గుండాల రవి, రమేశ్, వలపు వెంకన్న, సుధాకర్, జలగం నరేశ్, దండు రామచంద్రం, శ్రీధర్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE

- **Ready to Occupy 1 BHK, 2BHK & 3 BHK** Flats with all Facilities for Sale @ 941 Sqft to 1914 sqft with reasonable Prices at Vikas Nagar & Basith Nagar. Ph: 8897221187, 9177592357. [WA-6757]

PLOT FOR SALE

- నాయుడు పెట్రోల్ పంపు ఎదురుగా మెయిన్ రోడ్డుకు తూర్పు ఫేస్ తో పె: 44ft x పా: 85ft గల ప్లాట్ అమ్మకమునకి కలదు. సంప్ర।। 9849121543. [SCA25007024]
- **Wgl-Hyd** మెయిన్ రోడ్‌కి రాంపూర్ కపిల్ ఫుడ్స్ బ్యాక్ సైడ్, 2nd బిట్ ఈస్ట్ నార్త్ వెస్ట్ ప్లాటు 3 పక్కల 30ft రోడ్డు కలదు. టోటల్ యార్డ్స్ 1433 అమ్మబడును. సంప్ర।। 9849121543. [SCA25007025]

REAL ESTATE

- జీడికల్ Nr రామాలయం గజం కేవలం 4999/- లాంచింగ్ ఆఫర్, బుకింగ్ Rs. 108000. 1గ్రా. గోల్డ్ ఫ్రీ మార్కెటింగ్ ఏజెంట్స్ కావాలి. ఫోన్ 6302280020 [SCA25007242]

SERVICES

- హౌస్, ఓపెన్ ప్లాట్, బిజినెస్ లోన్స్, ప్లాట్ పర్చేస్ లోన్స్, కన్‌స్ట్రక్షన్ మరియు ప్రవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. సంప్ర।। సెల్: 8096520976. [WA-6758]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ।। 260/- అదనపు లైను రూ।। 60/- మాత్రమే 5% GST అదనము

పట్టా పాస్‌బుక్ పోయినది

- పిట్టల రామచంద్రయ్య, S/o. గారయ్య, R/o. చెన్నూర్ గ్రామం, పాలకుర్తి మండలం, జిల్లా జనగామ గార్లవి ఒరిజినల్ అగ్రికల్చర్ ల్యాండ్ పాస్‌బుక్ నెం: T23100160402 ఖాతా నెం. 485 గలవి. తేది: 10-7-2025 రోజున తీసుకొని బైక్ పై ఘన్‌పూర్ నుండి పాలకుర్తి వస్తుండగా కవర్‌లో ఉన్న పాస్‌బుక్ & జిరాక్స్‌లు గూడూరు, పాలకుర్తి మధ్యలో పోయాయి. దొరికిన వారు ఈ నెంబర్‌కి తెలుపుగలరు. సెల్: 8897536083. [SCA25007245]

WANTED

- డ్రైవర్స్ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయుటకు DCM & బోలారో డ్రైవర్స్ కావలెను. ఫోన్ కాల్ టైమ్ 11am-6pm. Cell: 9396991649. [SCA25007145]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.